సాక్షి తిరుపతి

మంగళవారం। 7। నవంబర్। 2023



ప్రజలే నేరుగా ఎన్నుకోవాలి

సీఎం, పీఎం వంటి వారిని ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకోవాలని డెప్యూటీ సీఎం నారాయణ స్వామి సూచించారు. - IIలో



స్కూల్ బస్సు బోల్తా

సత్యవేడు సమీపంలో ఓ ప్రయివేటు కళాశాల బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఓ విద్యార్థి స్వల్పంగా గాయపడ్డాడు. - IIలో



విన్నర్స్ విశాఖపట్నం, కృష్ణా

తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ హైస్కూల్లో జరిగిన అండర్-19 రాష్ట్ర స్థాయి బాలబాలికల వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. - IIలో

న్యూస్‌రీల్

స్పందన అర్జీలకు అత్యధిక ప్రాధాన్యం



అర్జీలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ

తిరుపతి అర్బన్: స్పందన అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జేసీతోపాటు డీఆర్వో పెంచలకిషోర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసరావు, శ్రీనివాసులు అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 140 అర్జీలు రాగా.. అందులో 102 అర్జీలు రెవెన్యూకు సంబంధించినవిగా గుర్తించారు. వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్టు జేసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ భాస్కర్ నాయుడు, కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ భవానీశంకర్ పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 66 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుంచి మొత్తం 66 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయన్నారు. వెంటనే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు.

ఉద్యోగాలకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్: పోషణ్ అభియాన్ స్కీమ్ కింద జిల్లా ప్రాజెక్టు మేనేజ్మెంట్ యూనిట్, బ్లాక్ ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ యూనిట్లలో పనిచేయడానికి ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి జయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో జిల్లా కో-ఆర్డినేటర్ పోస్టు-1, జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టు -1, బ్లాక్ కో-ఆర్డినేటర్ పోస్టులు -7 ఉన్నట్టు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం tirupati.ap.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 78,389 మంది స్వామివారిని దర్శించుకోగా 23,466 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.87 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మెటీరియల్ సైన్స్‌కు ఎంతో ప్రాముఖ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐసర్ డైరెక్టర్ శాంతన భట్టాచార్య

తిరుపతి సిటీ: ఆధునిక కాలంలో మెటీరియల్ సైన్స్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందని ఐసర్ డైరెక్టర్ శాంతన భట్టాచార్య అన్నారు. సోమవారం ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ఎస్వీయూ భౌతిక శాస్త్ర విభాగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త నిర్వహణలో రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సును సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ఐసర్ డైరెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు, పరిశోధకులు మెటీరియల్ సైన్స్‌లో విభిన్న విభాగాలు, విభిన్న వస్తువులు, విభిన్న పదార్థాలలో నూతన ఆవిష్కరణల దిశగా సాగాలన్నారు. విద్యార్థులను మెటీరియల్ సైన్స్ వైపు అధ్యాపకులు ప్రోత్సహించాలన్నారు. పరిజ్ఞానాన్ని నవీకరించడానికి ఇలాంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయన్నారు.అంతర్జాతీయ వేదికలలో వినూత్న పరిశోధనల గురించి చెప్పడం ద్వారా విద్యార్థుల శక్తి సామర్థ్యాలను నిరూపించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్వీయూ వీసీ ఆచార్య రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఓఎండీ హుస్సేన్, ప్రిన్సిపల్ కేటీ రామకృష్ణారెడ్డి, విభాగాధిపతి విజయలక్ష్మి, సదస్సు కన్వీనర్ దేవప్రసాద్‌రాజు, రాణి రుద్రమదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.



- ఈ ఫొటోలోని మహిళ పేరు అజేశ్వరి. ఆమెది శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు పంచాయతీ, ఈశ్వరయ్యకాలనీ. ఆమెకు గతంలో సర్వే నం.201-4లో 2.2 ఎకరాల భూమి మంజూరైంది. దానికి అప్పటి అధికారులు డీ నమూనా పట్టా కూడా మంజూరు చేశారు. అయితే అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు కబ్జాచేశారు. అజేశ్వరి పేరుపై ఉన్న పట్టాను పార్వతి పేరుపై మార్పు చేయించి స్వాధీనం చేసుకున్నారు. ఇదేంటని ప్రశ్నించినా అప్పటి అధికారులు పట్టించుకోకపోవడంతో మిన్నకుండిపోయారు. అధికారులు గ్రామంలో పర్యటించి ఆక్రమిత భూములతోపాటు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని బాధితురాలు కోరుతున్నారు.



ఆక్రమించిన భూమిలో సాగులో ఉన్న నీలగిరి చెట్లు

శ్రీకాళహస్తిలో..

బొజ్జల అనుచరుల భూకబ్జా

అధికార అండదండలతో చెలరేగిపోయారు. అందినకాడికి అడ్డదిడ్డంగా ప్రభుత్వ భూములను కబ్జా చేశారు. తర్వాత అధికారులపై ఒత్తిడి చేసి ఎంచక్కా పట్టాలు చేసుకున్నారు. తిరిగి ఆ భూములను తమ బినామీ పేర్లపై మార్పు చేసి సాగులోకి తెచ్చారు. ఇప్పుడు మళ్లీ ఆ భూములను ప్రభుత్వానికే విక్రయించి పరిహారం పొందాలని యత్నిస్తున్నారు.. ఈ తతంగం ఎక్కడో కాదండోయ్.. దక్షిణకాశిగా పేరుగాంచిన శ్రీకాళహస్తి మండలంలో. ఇక్కడ మాజీ మంత్రి బొజ్జలగోపాలకృష్ణారెడ్డి అనుచరుల భూబాగోతం ఏంటో మీరే చదవండి..

- ప్రభుత్వ భూమికి దొంగ పట్టాలు
- ఆక్రమిత భూమిలో అనధికారిక పంటలు
- తాజాగా కారిడార్‌కు భూములు విక్రయించడానికి యత్నాలు
- ఎకరాకు రూ.18 లక్షల వరకు డిమాండ్
- విస్తుపోతున్న స్థానికులు

తిరుపతి అర్బన్: వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా పర్వాలేదన్నట్టు.. నాయకుడు మనవాడైతే ఆక్రమణలకు ఏ భూమి లైనా ఏముందిలే.. అన్నట్టు శ్రీకాళహస్తికి చెందిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అనుచరులు రెచ్చిపోయారు. బొజ్జల ప్రధాన అనుచరుడుగా గుర్తింపు పొందిన శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత ప్రభుత్వ భూమిని అడ్డదిడ్డంగా ఆక్రమించేపనిలో పడ్డాడు. తమ నాయకుడు మంత్రిగా చలామణి అవుతుండడంతో ఇక తనకు ఎదురేలేదని భావించాడు. ఇదే క్రమంలో 2016లో శ్రీకాళహస్తి మండలంలోని వాగివేడు పంచాయతీ, వెంగళంపల్లిలో సుమారు 50 ఎకరాల అనాధీనం ప్రభుత్వ భూమిని కబ్జాచేశాడు. రెండేళ్ల తర్వాత అప్పటి అధికారులపై ఒత్తిడి చేసి 2018లో ఆ భూములను తన బినామీ పేర్లతో మార్పుచేసి, దొంగ పట్టాలు సృష్టించాడు. ఆపై ఆక్రమిత భూముల్లో నీలగిరి మొక్కలు నాటి సాగులోకి తెచ్చాడు. ఇంకొంత భూమిని ఖాళీగా వదిలేశాడు.



ఆక్రమిత భూమిలో వెలికి తీసిన తెల్లరాయి

చూస్తే 'తెల్ల'బోవాల్సిందే!

ఖాళీగా వదిలేసిన భూముల్లో సాగునీటి కోసం గతంలో బావి తవ్వారు. ఆ క్రమంలో అక్కడ తెల్లరాయి బయటపడడంతో వెంటనే మైనింగ్ వ్యాపారానికి తెగబడ్డారు. ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా తెల్లరాయిని వెలికితీసి ఇతర ప్రాంతాలకు తరలించేపనిలో పడ్డాడు. రోజుకు రెండు లారీల చొప్పున తరలిస్తుండగా.. గ్రామస్తులు అడ్డుకోవడంతో మిన్నకుండిపోయాడు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎక్కడ చూసినా వెలికితీసిన తెల్లరాయే కనిపిస్తోంది.

పరిహారం కోసం పన్నాగం

రాష్ట్ర ప్రభుత్వం ఎంపేడు, ఈశ్వరయ్యకాలనీ, వాగివేడు, మన్నవరం తదితర పంచాయతీల పరిధిలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. దానికితోడు ఈ ప్రాంతంలో ఐసర్, ఐఐటీ ఏర్పాటు కావడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. త్వరలో ఆపాచీ, మరికొన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు భూమి పూజలు సైతం పూర్తయ్యాయి. కొన్ని పరిశ్రమలు నిర్మాణ దశలో ఉండగా.. మరికొన్ని తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ క్రమంలో ఆయా భూములపై సదరు టీడీపీ నేత కన్నుపడింది. ఎలాగైనా ఆక్రమిత భూములకు పరిహారం దక్కించుకోవాలని ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఎకరాకు రూ.15 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు పరిహారం ఇవ్వాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి దొంగ పట్టాలు చేసుకుని అదే భూములకు పరిహారం ఇవ్వాలంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయడం విస్మయానికి గురిచేస్తోంది.

బినామీ పేర్లతో పట్టాలు

సర్వే నం.	పట్టదారుని పేరు	విస్తీర్ణం (ఎకరాలు)	సర్వే నం.	పట్టదారుని పేరు	విస్తీర్ణం (ఎకరాలు)
181-1	టీ.రవీంద్రారెడ్డి	5	287-2	ఎం.జయలక్ష్మి	1.75
161-1.2	టీ.లీనా	2	287-3	జీ.పండుమ్మ	1.85
160,181-2	టీ.యశోదమ్మ	3	287-4	ఎం.జ్యోతి	1.85
168-7	ఎం.సునీత	1.75	287-5	డీ.వెంకటసుబ్బమ్మ	1.85
168-1ఏ	కే.శాంతి	1.78	167-4ఏ	శ్రీకళ	1.9
168-2ఏ	ఎం. వెంకటమ్మ	1.70	498-2	టీ.సుమతి	3.24
168-6ఏ	ఎం.లక్ష్మమ్మ	2	498-2	టీ.లీనా	3.86
167-9	జీ.సుబాషిణి	0.86	498-2	ఎల్.గంగమ్మ	2.81
168-5ఏ	జీ.సుభాషిణి	1	498-5	టీ.గురవారెడ్డి	3.92
168-3ఏ	పీ.గురవమ్మ	1.6			



విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఊరుకోం. ఎంతటి వారైనే ఉపేక్షించేది లేదు. ఎప్పుడు ఆక్రమించినా చర్యలు తీసుకుంటాం. మరోసారి గ్రామంలో విచారణ చేస్తాం. ఆక్రమణలు నిజమని తేలితే తప్పకుండా స్వాధీనం చేసుకుంటాం. ప్రభుత్వ భూముల జోలికి వెళ్లి అనవసరంగా చిక్కుల్లో పడొద్దు. ఎవరైనా ఆక్రమించి ఉంటే స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించాలని కోరుతున్నాం. –ద్వారకానాథ్‌రెడ్డి, తహసీల్దార్, శ్రీకాళహస్తి మండలం





టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి, బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డితో భూ ఆక్రమణదారులు

ఆక్రమించి.. బినామీలకు పంచి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేదలకు పెద్ద ఎత్తున భూములు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు పంచాయతీ, ఈశ్వరయ్య కాలనీకి చెందిన 60 కుటుంబాలకు రెండు విడతలుగా 152 ఎకరాలు పంపిణీ చేశారు. ఆయా భూములు సాగులోకి తెచ్చేవిధంగా చర్యలు చేపట్టారు. కానీ చేతిలో చిల్లిగవ్వలేని గిరిజనులు కొందరు సదరు భూములను సాగుచేయలేక అలాగే ఖాళీగా వదిలేశారు. దివంగత నేత మరణానంతరం టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానికంగా ఉన్న సదరు టీడీపీ నేత చక్రం తిప్పారు. ఈశ్వరయ్య కాలనీకి చెందిన 17 గిరిజన కుటుంబాలు స్థానికంగా లేవని అప్పటి అధికారులకు నివేదిక ఇచ్చారు. ఆ తర్వాత ఆయా కుటుంబాలకు మంజూరైన ప్రభుత్వ భూమి సుమారు 50 ఎకరాలను అప్పటి అధికారులపై ఒత్తిడిచేసి గుట్టుచప్పుడుకాకుండా తన అనుచరులపై మార్పు చేయించారు. ఆపై వారి ద్వారానే సాగులోకి తెచ్చి నీలగిరి చెట్లు నాటించారు. ఇప్పుడు ఆయా భూములకు పరిహారం ఇవ్వాలంటూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

అదే సంకల్పం సంక్షేమం



సీఎం జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మేయర్ శిరీష, పాలగిరి ప్రతాప్‌రెడ్డి, ముద్రనారాయణ

- ప్రజాసంకల్ప యాత్రకు ఆరేళ్లు
- తిరుపతిలో వైఎస్సార్ విగ్రహానికి ఘన నివాళి

తిరుపతి మంగళం: 'ప్రజాసంకల్పయాత్రలో ప్రజల కష్టాలు నేరుగా చూశారు. అదే సంకల్పంతో అధికారంలోకి రాగానే 99 శాతం హామీలు అమలు చేశారు. మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు' అని తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష కొనియాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర ఆరేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా తిరుపతి తుడా సర్కిల్ వద్ద సోమవారం పార్టీ నగర అధ్యక్షులు పాలగిరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలు, సమస్యలను తెలుసుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర చేపట్టి ప్రతి పేదవాడి గుండె చప్పుడును తెలుసుకున్నారన్నారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే అమలు చేసి మన్ననలు అందుకుంటున్నారని కొనియాడారు. దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడికీ సాధ్యం కానన్ని సంక్షేమ పథకాలను అందించారని తెలిపారు. అనంతరం పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఇచ్చిన మాట ప్రకారం అటు సంక్షేమాన్ని ఇటు అభివృద్ధిని కొనసాగిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ సంస్థల చైర్మన్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి

పాకాల : మండలంలోని పేరసానిపల్లి, పదిపుట్లబైలు పంచాయతీ పరిధిలో ఉన్న పంట పొలాలపై ఏనుగుల గుంపు వరసదాడులకు పాల్పడుతోంది. వరి, అరటి, టమాట, పశుగ్రాసం సర్వనాశనం చేస్తున్నట్టు స్థానిక రైతులు వాపోతున్నారు. ఏనుగల కట్టడికి అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

9న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



విశేష అలంకరణలో పద్మావతి అమ్మవారు(ఫైల్)

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ జరగనుంది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు పుణ్యాహవచనం, రక్షాబంధనం, సేనాధిపతి ఉత్సవం, యాగశాలలో అంకురార్పణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

రైతన్నలకు భరోసా!



నేడు వైఎస్సార్ రైతు భరోసా ఐదో విడత కార్యక్రమం

- జిల్లాలో 1,80,654 మందికి లబ్ధి
- వడమాలపేటలో జిల్లా కార్యక్రమం

తిరుపతి అర్బన్: వైఎస్సార్ రైతు భరోసా కార్యక్రమానికి సర్వం సిద్ధం చేశారు. వడమాలపేట మండలంలో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 5వ ఏడాది రెండో విడతలో భాగంగా ఒక్కో రైతుకు రూ.4 వేలు చొప్పున మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్యసాయి జిల్లా, పుట్టపర్తి నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. అదే సమయంలో తిరుపతి జిల్లా కార్యక్రమాన్ని వడమాలపేటలోని ఎస్‌ఆర్‌టీ కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,80,654 మంది రైతులకు రూ.73.95 లక్షలు మంజూరు చేయనున్నారు.

ఏటా రూ.13,500 వేలు

వైఎస్సార్‌రైతు భరోసా కింద ఒక్కో రైతుకు రూ.13,500 చొప్పున పంపిణీ చేస్తున్నారు. తొలి విడతగా రూ.7,500, రెండో విడత రూ.4వేలు, మూడో విడత రూ.2 వేలు చొప్పున ఏటా అందజేస్తున్నారు.

శ్రీశైలం దేవస్థానానికి కారు వితరణ



శ్రీశైలం దేవస్థానంకు కారును అందజేస్తున్న దాత ఉదయ్‌కుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

తిరుపతి కల్చరల్: శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానానికి తిరుపతి కెవ్విన్ ఆటో మోటార్స్ అధినేత ఆర్.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు సోమవారం రూ.14 లక్షలు విలువైన ఎంజీ ఆస్టర్ కారును ఆలయ ఈవో డి.పెద్దిరాజుకు అందజేశారు. దాత ఉదయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలులో షోరూం ప్రారంభం సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానానికి కారు అందించామన్నారు.

స్కాలర్‌షిప్ వివరాలపై ఆరా



వర్సిటీ అధికారులు, విద్యార్థులతో ధ్యానకుమార్ జినప్ప

తిరుపతి సిటీ: జాతీయ మైనారిటీ కమిషన్ ప్రతినిధి ధ్యానకుమార్ జినప్ప సోమవారం మహిళా యూనివర్సిటీలో పర్యటించారు. ఈ సందర్భంగా వీసీ డీ.భారతి, రిజిస్ట్రార్ ఎస్.రజిని, వర్సిటీ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. వర్సిటీలో మైనారిటీ ఉద్యోగులు, విద్యార్థులకు అందుతున్న స్కాలర్‌షిప్ వివరాలపై ఆరాతీశారు. అనంతరం మైనారిటీ ఉద్యోగులు విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. కేంద్రప్రభుత్వం అందిస్తున్న స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగులకు సంబంధించిన పలు విషయాలపై ఆయన చర్చించారు.

8న రాష్ట్ర స్థాయి బాలుర స్విమ్మింగ్ పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 8న తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో అండర్-14, అండర్-17 రాష్ట్ర స్థాయి బాలుర స్విమ్మింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు ఎస్జీఎఫ్ అండర్-14 జిల్లా కార్యదర్శి పి.విజయకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 13ఉమ్మడి జిల్లాల నుంచి స్విమ్మర్లు, కోచ్‌లు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

సీఎం, పీఎంలను ప్రజలే నేరుగా ఎన్నుకోవాలి

- అప్పుడే పొలిటికల్ వ్యభిచారం పోతుంది
- విలేకరుల సమావేశంలో డెప్యూటీ సీఎం కే.నారాయణస్వామి


డెప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుపతి రూరల్: 'ఒక పార్టీలో గెలిచిన ఎమ్మెల్యే కాసులకు కక్కుర్తిపడి మరో పార్టీలోకి జంప్ చేస్తున్నాడు.. పార్టీని స్థాపించి, రెక్కల కష్టంతో గెలిపించి, అధికారంలోకి తెచ్చిన వ్యక్తికి వెన్నుపోటు పొడుస్తున్నారు. ఇలాంటివి పోవాలంటే ఎన్నికల వ్యవస్థను మార్చాలి. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి వంటి వ్యక్తులను ప్రజలే ఎన్నుకునేలా ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి'.. అని ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామి తెలిపారు. తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం తిరుమలలో తాను మాట్లాడిన సీఎం, పీఎం పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు జరగాలనే తన అభిప్రాయాన్ని మరోసారి సమర్థించుకున్నారు. రాజకీయ మోసకారి చంద్రబాబు లాంటి వారి నుంచి రాజకీయ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 2014లోనూ వైఎస్సార్‌సీపీ జెండాపై గెలిచిన 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి రాజకీయాలను భ్రష్టుపట్టించిన దుర్మార్గుడు చంద్రబాబే అన్నారు. దమ్ముంటే జగన్‌కు దీటుగా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రత్యక్ష ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. తండ్రికి వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు వత్తాసు పలుకడమే కాకుండా, తండ్రి శత్రువులాగా చూసిన కాంగ్రెస్‌తో జతకట్టి మంత్రి పదవులు తీసుకుని, బీజేపీతో అంటకాగుతున్న పురందేశ్వరి తీరు చూస్తే ఎన్టీయార్ ఆత్మ కూడా ఘోషిస్తుందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటున్న జర్నలిస్టులు అంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక అభిమానం ఉందని, అందుకే రాష్ట్రంలోని అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలని తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, మునస్వామి పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యమే లక్ష్యం


వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: అందరికీ ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో జగనన్న ఆరోగ్య సురక్ష పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, వైద్య అధికారులు హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో అదే అంశంపై సమీక్షించారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి ఫ్యామిలీ డాక్టర్లను అనుసంధానం చేయాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స అందించాలని సూచించారు. ఇప్పటికే జగనన్న సురక్ష ద్వారా 2.23 లక్షల మందికి వైద్య సేవలు అందించినట్టు పేర్కొన్నారు. సమీక్షలో సీపీఓ ప్రేమచంద్రారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డీఎల్‌డీఓ సుశీలాదేవి, జిల్లా లెప్రసీ ప్రోగ్రాం అధికారిణి అరుణ సులోచనాదేవి పాల్గొన్నారు.

నవోదయకు దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 9వ తరగతి, 11వ తరగతి ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుకు చివరి గడువు 15 నవంబర్ 2023 వరకు ఉంటుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ యస్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలియచేశారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2009 మే 1 నుంచి 2011 జూలై 31 మధ్య జన్మించిన వారై ఉండాలని, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2007 జూన్ 1 నుంచి 2009 జూలై 31 మధ్యన జన్మించిన వారై ఉండాలని,పరీక్షా తేదీ 10 ఫిబ్రవరి 2024న ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం 8688888802 / 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

స్కూల్ బస్సు బోల్తా

సత్యవేడు: మండల పరిధిలోని డీ.బాబు జూనియర్ కళాశాల బస్సు ఆంబాకం మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. సోమవారం ఆంబాకం నుంచి సత్యవేడుకు వస్తుండగా గ్రామ సమీపంలోని మామిడితోట మలుపు ఉన్న పల్లపు ప్రాంతంలో మరో వాహనానికి దారి ఇచ్చే క్రమంలో ఒరిగిపోయింది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఓ విద్యార్థికి స్వల్పగాయాలయ్యాయి. వెంటనే గ్రామస్తులు స్పందించి విద్యార్థులు, డ్రైవర్‌ను బయటకు తీశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న నేదురుమల్లి

సైదాపురం: మండలంలోని తుమ్మలతలుపూరు పంచాయతీకి చెందిన టీడీపీ ఉప సర్పంచ్ దాసినేని శ్రీకాంత్ చౌదరి తోపాటు వెంకటరమణయ్య తన అనుచరులతో కలిసి సోమవారం వైఎస్సార్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపలో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

విన్నర్స్ విశాఖపట్నం, కృష్ణా

- రన్నర్స్ పశ్చిమ గోదావరి, గుంటూరు
- ముగిసిన రాష్ట్ర స్థాయి అండర్-19 బాల బాలికల వాలీబాల్ పోటీలు


బాలుర విభాగంలో విన్నర్స్‌గా నిలిచిన విశాఖపట్నం జిల్లా జట్టు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ హైస్కూల్లో మూడు రోజులుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) నిర్వహిస్తున్న అండర్-19 రాష్ట్ర స్థాయి బాలబాలికల వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీలకు హాజరైన రాష్ట్రంలోని 13ఉమ్మడి జిల్లాల బాలబాలికల జట్లకు లీగ్, నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. బాలుర విభాగం ఫైనల్స్‌లో పశ్చిమ గోదావరిపై విశాఖపట్నం, బాలికల విభాగంలో గుంటూరుపై కృష్ణా జిల్లా జట్లు విజయం సాధించాయి. బాలుర విభాగంలో తృతీయ, నాల్గవ స్థానాల్లో విజయనగరం, శ్రీకాకుళం జట్లు, బాలికల విభాగంలో విశాఖపట్నం, అనంతపురం జట్లు నిలిచాయి. వివిధ జిల్లాల జట్లలో ప్రతిభ చాటిన క్రీడాకారులతో జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర బాలబాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు ఎస్జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. కార్యక్రమంలో 13జిల్లాల వాలీబాల్ క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా


మాట్లాడుతున్న జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ రాజేంద్ర

వరదయ్యపాళెం: మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ రాజేంద్ర తెలిపారు. శ్రీసిటీ పారిశ్రామికవాడలో సోమవారం తిరుపతి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన ప్రసంగించారు. జిల్లావ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణా మార్గాలను గుర్తించాలని సూచించారు. పోలీస్ సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగం సంబంధిత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎలాంటి చట్టపరమైన శిక్షలకు గురవుతారో గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా నాటు సారా తయారీని పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. పాత నేరస్తులపై గట్టి నిఘా పెట్టాలన్నారు. జిల్లాను గంజాయి రహిత జోన్‌గా మార్చడానికి సెబ్, స్థానిక పోలీసులు సమష్టిగా పనిచేయాలని కోరారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్న శ్రీసిటీని డ్రగ్స్ రహిత ప్రశాంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో తిరుపతి అర్బన్, రూరల్, తిరుమల, చంద్రగిరి రూరల్, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాగలాపురం, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, వాకాడు సెబ్ సీఐలు, ఎస్ఐలు, జిల్లా టాస్క్‌ఫోర్స్, ఇంటెలిజెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.